క్లుప్తంగా

నేడు ఖాదర్‌పల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను అందజేస్తామన్నారు.

బియ్యం నూరు శాతం పంపిణీ చేయాలి

ప్రొద్దుటూరు : ఎండీయూ ఆపరేటర్లు బియ్యం నూరు శాతం పంపిణీ చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆపరేటర్లకు కేటాయించిన పరిధిలో మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని, ఇతర ప్రాంతాలకు వెళ్ల వద్దని కోరారు. చాలా మంది 85 శాతం మాత్రమే పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఆర్‌ఐ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మహిళలతో ర్యాలీ

ప్రొద్దుటూరు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ముందస్తు బెయిల్ వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 8 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి శివాలయం వరకు మహిళలు 108 కలశాలు చేతపట్టుకుని ఊరేగింపుగా వెళతారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో అల్పాహారం చేసిన అనంతరం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచడంతోపాటు ఆటపాటలు, నైతిక విలువలు పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

నూతన చర్చి ప్రారంభం



నూతన చర్చిని ప్రారంభిస్తున్న పీఠాధిపతులు

బద్వేలు అర్బన్ : కడప మేత్రాసనం బద్వేలు డీనరీలోని కొత్తచెరువు విచారణలో నూతనంగా నిర్మించిన చర్చిని బుధవారం కడప, నెల్లూరు మేత్రాసనం పీఠాధిపతులు మహాఘన గాలి బాలి, ఎం.డి.ప్రకాశంలు ప్రారంభించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కొత్తచెరువు విచారణ గురువులు బల్లాలపు ఆశీర్వాదంను పీఠాధిపతులు సన్మానించారు. బద్వేలు డీన్ ఫాదర్ జాలా విజయభాస్కర్, ఫాదర్ దేవదాసు పాల్గొన్నారు.

ఆప్కాబ్ డీసీసీబీకి ఆక్సిజన్ లాంటిది



భూమిపూజ చేస్తున్న మల్లెల ఝాన్సీరాణి

బి.కోడూరు : ఆప్కాబ్ సంస్థ జిల్లాలోని డీసీసీ బ్యాంకులకు, వారి నుంచి వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఆక్సిజన్ లాంటిదని ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం నూతన కమ్యూనిటీ హాలు భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. బి.కోడూరు మండలానికి సుమారు రూ.22 లక్షలను నూతన కమ్యూనిటీ హాలు భవవ నిర్మాణం కోసం జిల్లాలో మొట్టమొదటగా కేటాయించడం జరిగిందన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ నారాయణరెడ్డి, డీసీసీ బ్యాంకు మేనేజర్ కళావతి, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

కలసపాడు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం చింతలపల్లెలో ఎఫ్‌ఆర్‌ఓ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించి మాట్లాడారు. అందరి చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు.

ప్రొద్దుటూరు : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో బుధవారం నెహ్రూయువకేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉప డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎన్‌వీ దివాకర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ లైఫ్ స్టైల్ మార్చుకోవాలన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి, సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను ప్రతి లబ్ధిదారుడు గౌరవించాలి

ఖాజీపేట : పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందని.. వలంటీర్లు అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సూచించారు. ఖాజీపేటలోని షాదీఖానాలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ అనే వలంటీర్‌కు సేవా వజ్ర పురస్కారంతోపాటు మరో 5 మందికి సేవా పురస్కారాలను సత్కరించి అందించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ఖాజీపేట మండలానికి రూ. 150 కోట్ల సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులు ఖాతాల్లోకి చేరిందన్నారు. లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలను అందించడంలో ముఖ్యపాత్ర పోషించిన వలంటీర్లకు వందనం తెలియజేశారు. వలంటీర్లను ప్రతి లబ్ధిదారుడు గౌరవించాలన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, జెడ్పీటీసీ ధవనం పుష్పలత, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్లు కరీముల్లా, ఎంపీడీఓ మైథిలి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చంద్రశేఖర్, బుజ్జి, ఉప మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డితోపాటు పలువురు మండల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పది ఫలితాలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం

విద్యారంగానికి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తున్నా పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో దారుణంగా పడిపోయిన ఉత్తీర్ణత శాతంపై ఎంఈఓ, ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఖాజీపేట ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ అబూబకర్ సిద్దిక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపేట హైస్కూల్‌లో కేవలం ముగ్గురు పాస్ కావడంపై మండిపడ్డారు. ముగ్గురు పాస్ కావడం కోసం వేల కోట్లు ఖర్చు చేయాలా.. స్కూల్ మూసేస్తే సరిపోతుంది కాదా అంటూ ప్రశ్నించారు. బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో ఉత్తీర్ణతా శాతాన్ని పరిశీలించారు. సబ్జక్టు వారీగా పాస్ శాతం వివరాలు ఇవ్వాలని ఎంఈఓ స్వర్ణలతకు సూచించారు.. లోపాలను సరిచేసుకుని ఉత్తమ పనితీరు కనబరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి ఏఈ లేక ఏడీ రావాలి అలా కాకుండా కేవలం లైన్‌మెన్ రావడంపై ఎమ్మెల్యే స్పందించారు. సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా రావాలి కాదా అన్నారు. సభ్యుల సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వాలని వాటి పరిష్కరిస్తామని సర్పంచ్, ఎంపీటీసీలకు సూచించారు. చుక్కల భూముల రైతులు దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ ద్వారా పరిశీలన చేసి ఇస్తారని అన్నారు. ఖాజీపేట ఏఓ కార్యాలయం ఎప్పుడు చూసిన మూత వేసి ఉంటుందని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఫీల్డ్ పనులు, కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా ఇలా జరుగుతోందన్నారు. అందుకు కావాల్సిన విత్తనాల రకాలను నాకు చెబితే అందుబాటులోకి వచ్చేలా చేస్తానని సూచించారు.



చాపాడు: నక్కలదిన్నెలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి

నక్కలదిన్నెలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ

చాపాడు : ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు రఘురామిరెడ్డి వైద్య శాఖ, ఆర్ అండ్ బీ అధికారులతో కలసి భూమిపూజ చేశారు. పీహెచ్‌సీ నిర్మాణానికి నక్కలదిన్నెకు చెందిన పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి 1.12 ఎకరాల స్థలం ప్రభుత్వానికి ఇచ్చారు. త్వరితగతిన, నాణ్యతగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, ఆర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి, డీఈఈ కంబగిరి, ఏఈ దాదాబాషా, కాంట్రాక్టర్లు నాగమునిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, ప్రొద్దుటూరు శివాలయ మాజీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్యశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.



ఖాజీపేట: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

రాజుపాళెం : మండలంలోని వెలవలి హరిజనవాడలో నిర్మించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట బుధవారం నిర్వహించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారం, మండల ఇన్‌చార్జి ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి సహకారం, కృషితో ఆలయాన్ని నిర్మించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో కార్యక్రమం జరిగింది. అనంతరం ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు.

ఎమ్మెల్యే రాచమల్లు దంపతుల పూజలు

కోదండ రామాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆయన సతీమణి, కౌన్సిలర్ రమాదేవిలు పూజలు చేశారు. ముందుగా వారు గ్రామంలోకి రాగానే నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుభాషిణి, సుదర్శన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలు స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణానికి సొంత నిధులు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం అక్కడకు వచ్చిన వారందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, సర్పంచులు మహబూబ్ బాషా, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, రమాదేవి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

బద్వేలు అర్బన్ : ప్రస్తుత వేసవి కాలంలో మండల పరిధిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తప్పనిసరిగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని కొన్ని పంచాయతీల్లో లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని, అవసరమైన మేర ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి అంగన్‌డీ కేంద్రంలో తప్పనిసరిగా మెను పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఇందుకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో వీధి కుళాయిలు సక్రమంగా లేక నీరు వృథాగా పోతుందని, నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను కోరారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

అట్లూరు మండల పరిధిలోని కమలకూరు వద్ద నిర్మించిన ఆనకట్ట కారణంగా బద్వేలు మండలం పుట్టాయపల్లె పంచాయతీలోని కొన్ని ప్రాంతాల్లో పంటలు నీట మునుగుతున్నాయని, ఆ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని జెడ్పీటీసీ వంకెలచిన్నపోలిరెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు సమావేశానికి హాజరు కాలేదని, సమస్య ఎవరికి తెలపాలని ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణయ్య, మండల ఉపాధ్యక్షులు బుట్టినరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ రామసుబ్బారెడ్డితో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం మానండి.. ఆరోగ్యం కాపాడుకోండి

చాపాడు : ధూమపానం చేయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాపాడులోని వీధుల్లో పొగాకు వాడకం పట్ల ఆరోగ్యానికి కలిగే ఇబ్బందులపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క నుంచి పొగ విడుదల అవుతుందని దీంతో దీనికి పొగాకు అని పేరొచ్చిందన్నారు. దీని ఆకుల నుంచి సిగరెట్లు, చుట్టలు, తాంబూళాలు తయారు చేస్తారన్నారు. పొగ తాగటం, పొగాకు చెక్క తినడం వలన లివర్, గుండె, ఊపిరితిత్తులు చెడిపోయి క్యాన్సర్, టీబీ వంటి వ్యాధులు వస్తాయన్నారు. వైద్యులు కావ్య మాధురి, ఓబులేసు, సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు నారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యాన్ని దహిస్తుంది

ప్రొద్దుటూరు క్రైం : పొగాకు ఆరోగ్యాన్ని పూర్తిగా దహించి వేస్తుందని కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ సరదాగా మొదలైన బీడి, సిగరేట్ వాడకం తర్వాత దురలవాట్లుగా మారుతాయన్నారు. పొగాకు విష కోరల నుంచి దేశప్రజలను విముక్తి చేసేందుకు జాతీయ స్థాయిలో సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. పొగాకు ఉత్పత్తులను, వాటి అమ్మకాలను పూర్తిగా నిషేధించాలని తెలిపారు. వైద్యాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ చుట్టా, బీడి, సిగరేట్, గుట్కా లాంటి పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంభవించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. బీడి, సిగరేట్ తాగి వదిలిన పొగ వల్ల పక్కనున్న వారు పీల్చి ప్రాణాంతక వ్యాధుల బారిన పడతారని చెప్పారు. 'మాకు ఆహారం కావాలి.. పొగాకు వద్దు' అని ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సభ్యులు చంద్రఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, అల్లాబకాష్ పాల్గొన్నారు.



చాపాడు: అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దువ్వూరులో..

దువ్వూరు : దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సురేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం వల్ల గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బులు, క్యాన్సర్ వస్తాయని తెలిపారు. ధూమపానం తాగకూడదని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల చిక్కులు తొలగించిన ప్రభుత్వం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములపై అధికారిక హక్కు లేకుండా ఇంత కాలం చుక్కల భూముల రైతులు ఎంతో మంది ఇబ్బంది పడ్డారని, ఇంత కాలానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చుక్కల చిక్కులు తొలగించిందని, రైతుల ఆత్మగౌరవాన్ని నిలిపిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని 1264 మంది రైతులకు 1572.39 ఎకరాలకు సంబంధించిన చుక్కల భూములకు పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ భూములపై అధికారిక హక్కులు కల్పించాలని కాళ్లరిగేలా రైతులు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారన్నారు. ఏ ప్రభుత్వం ఇంత వరకు రైతుల సమస్యలను గుర్తించలేదన్నారు. తన స్వగ్రామమైన పైడిపాలెంలో తనకు 50 ఎకరాల పొలం ఉందని, ఓ రైతుగా తాను కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నానన్నారు. చివరికి తన సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వరకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం సమస్య పరిష్కారం కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఊరట లభించినట్లయిందన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

విత్తనాలకు కూడా క్యూలో నిలబడాల్సి వచ్చేది

గత ప్రభుత్వాల్లో రైతులు విత్తనాలకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. అనేక సందర్భాల్లో రైతులపై లాఠీఛార్జి జరిగిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడే విత్తనాలను, ఎరువులను అందిస్తున్నారన్నారు. నాణ్యతను పరిశీలించేందుకు కూడా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించలేదని ఎమ్మెల్యే చెప్పారు. రైతులకు చుక్కల భూములపై హక్కులు కల్పించినందుకు ఓ రైతుగా తాను ఎంతో సంతోషిస్తున్నానని తెలిపారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒకే సంతకంతో ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించిందని, తద్వారా వారి జీవితాలు బాగుపడ్డాయన్నారు. కళ్లముందు ఆస్తి ఉన్నా హక్కులేని పరిస్థితి ఉన్న చుక్కల భూములకు పరిష్కారం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, రాజుపాళెం తహసీల్దార్ ఇందిరాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఏపీపీఎస్‌సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, రాయలసీమ పోలీసు కంప్లెయింట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సాయినాథరెడ్డి, సతీష్, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

బద్వేలు అర్బన్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ త్రైమాసిక సాధారణ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. బద్వేలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.1.45 కోట్లు కాగా రూ.1.55 కోట్లు వ సూలు చేసేందుకు కృషి చేసిన మార్కెట్ కమిటీ సె క్రటరీ, పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

సీఎం వైఎస్ జగన్‌కు వలంటీర్లే రథసారథులు

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్లే రథసారథులుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. బుధవారం నరసాపురంలోని స్త్రీశక్తిభవనంలో ఆమె వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రభు త్వం ఏర్పడిన వెంటనే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను మరింత చేరువ చేశారన్నారు. అనంతరం నరసాపురం గ్రామానికి చెందిన కర్నాసిఅజ్మీర్‌వలికి సేవా వజ్ర, షమీమ్, లక్ష్మి, శివనాగలక్ష్మి, రమణ య్య, రాముడుకు సేవారత్న, 141 మందికి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, తహసీల్దారు రామచంద్రుడు, సర్పంచ్‌లు పిచ్చిరెడ్డి, చిన్నఖాజావలి, నాయకులు పాల్గొన్నారు.



కాశినాయన : వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

వలంటీర్లు బాధ్యతాయుతంగా సేవలందించండి

కలసపాడు : వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి గ్రామానికి, మండలానికి, నియోజకవర్గానికి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కలసపాడుకు చెందిన వలంటీర్ పబ్బతి శ్రీనివాసులుకు సేవావజ్ర అవార్డు, సేవావజ్ర ఇద్దరికి, సేవారత్న 5 మందికి, సేవామిత్ర 156 మందికి అందజేసి ప్రశంసాపత్రం, శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి, బి.నారాయణయాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, షరీఫ్, కొండారమణమ్మ, ఎంపీడీఓ మహబూబ్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

బి.కోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లె పంచాయతీ పరిధిలోని సిద్ధుగారిపల్లె, గంగిరెడ్డిపల్లె, కుమ్మరోనిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభు త్వ పథకాలు వివరించారు.

సహకార సంఘాల అభివృద్ధికి పాటుపడాలి

సహకార పరపతి సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరు పాటుపడి తద్వారా ప్రజలు మరింత అ భివృద్ధి చెందాలని అందుకోసం సహకార పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.22 లక్షలు నాబార్డు నిధులతో ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘం నూతన కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి సంబంధించి సింగిల్ విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ నారా యణరెడ్డిల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు.

బాబు పాలనలోనే పీఎంఎఫ్ మూత

- నష్టపోయిన రైతులు
- రోడ్డున పడిన కార్మికులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు పరిపాలనను తలుచుకుంటే మూతపడిన ప్రొద్దుటూరు పాలకేంద్రం గుర్తు వస్తుంది. బాబు పరిపాలనకు ఇది ఒక మచ్చుతునకగా చెప్పవచ్చు. 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటి స్థానిక టీడీపీ నేతల నిర్వాకం వల్ల కర్మాగారం నష్టాల్లోకి వెళ్లింది. సమస్యను పరిష్కరించాల్సిన తెలుగుదేశం ప్రభుత్వం ఆకస్మికంగా కర్మాగారాన్నే మూసివేయడంతో జిల్లా రైతులు పూర్తిగా నష్టపోగా కార్మికులు రోడ్డున పడ్డారు.

జిల్లాలో వెలుగు వెలిగిన పీఎంఎఫ్

ప్రొద్దుటూరు ప్రాంతంలో పెన్నా, కుందూ నదుల తోపాటు కేసీ కెనాల్ పరిధిలో పరిధిలో ఎక్కువ ఆయకట్టు విస్తీర్ణం ఉంది. రైతులు విస్తారంగా పంటలు పండించడంతోపాటు పాడి పరిశ్రమపై ఆధారపడ్డారు. ఈ పరిస్థితులను చూసి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రొద్దుటూరులో సహకార సంఘం ఆధ్వర్యంలో పాలపదార్థాల కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. కర్మాగారం పరిధిలోని 360 గ్రామాల్లో సొసైటీలను ఏర్పాటు చేసి కర్మాగారానికి పాలు సరఫరా చేసేవారు. ప్రతి గ్రామంలో ఇద్దరు ఉద్యోగులను నియమించారు. రోజూ లక్షా 60వేల లీటర్ల పాలు సరఫరా అయ్యేవి. వీటితో విజయ బ్రాండ్ పేరుతో పాల పౌడర్, దూద్ పేడ, నెయ్యి, ఇతర పాల పదార్థాలను తయారు చేసేవారు. నాణ్యత ఎక్కువగా ఉండేదని, మిల్టరీ ఉద్యోగులకు సైతం ఈ కర్మాగారం నుంచే ప్రతినెలా పాల పౌడర్‌ను సరఫరా చేసేవారు. కర్మాగార ఉత్పత్తులకు అంత పేరుప్రఖ్యాతలు ఉండేవి. కర్మాగారంలో దాదాపు 500 మంది ఉద్యోగులు పనిచేసేవారు. ఈ ప్రభావం కారణంగా గ్రామాల్లో పాడి పరిశ్రమపై ఆధారపడి రైతులు జీవనం సాగించేవారు.



మూత పడిన ప్రొద్దుటూరు పాలపదార్థాల కేంద్రం (పీఎంఎఫ్)

1995లో మూసివేత

ఇంతటి గొప్ప కర్మాగారాన్ని టీడీపీ ప్రభుత్వం 1995లో మూసివేసింది.సీపీఐ ఆధ్వర్యంలో అప్పట్లో కలెక్టరేట్ వద్ద కర్మాగారాన్ని తెరిపించాలని నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. రైతులు, ఉద్యోగులు అందరూ కలసి ఆందోళన చేశారు. నాటి నుంచి నేటి వరకు పరిస్థితి అలాగే ఉంది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు అప్పట్లో ఈ విషయంపై తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపట్టారు.

పీఎంఎఫ్‌ను పునరుద్ధరించాలని పోరాటం చేశాం



మూడుపువ్వులు, ఆరు కాయలుగా నడిచే పీఎంఎఫ్‌ను ప్రభుత్వం మూసివేసింది. దీనిని పునరుద్ధరించాలని జిల్లా వ్యాప్తంగా కార్మికులు, రైతులు తరపున పోరాటం చేశాం. సమస్య హైదరాబాద్ వరకు వెళ్లింది. అప్పటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని కారణంగా పరిశ్రమ తెరవలేదు. సుమారు రూ.6కోట్ల వరకు పాడి రైతుల బకాయిలను చెల్లించారు. నిరవధిక ఆందోళన చేసిన తనను పోలీసులు అరెస్టు చేసిన తర్వాత వెంకటస్వామి, రామయ్యలు దీక్ష చేపట్టారు. చంద్రబాబు హయాంలోనే పాలకేంద్రాలు, చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయి.

\- జి.ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

హెరిటేజ్ పరిశ్రమ కోసమే మూసేశారు



చంద్రబాబు తన హెరిటేజ్ మిల్క్ పరిశ్రమ కోసమే పీఎంఎఫ్‌ను మూసేశారు. ఓ వైపు రైతులు, మరో వైపు కార్మికులు పరిశ్రమ మూతతో తీవ్రంగా నష్టపోయారు. కొంత మంది చిల్లరంగళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఆర్థిక పరిస్థితులు బాగలేక మనో వేదనతో మృతి చెందారు. ప్రొద్దుటూరులో ఎవరిని అడిగినా చంద్రబాబు ప్రభుత్వమే ఇందుకు కారణమని ఘంటాపదంగా చెబుతారు.

\- సానబోయిన శేఖర్ యాదవ్, ఎంపీపీ, ప్రొద్దుటూరు

బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని బీసీ ప్రజాచైతన్యసమాఖ్య అధ్యక్షుడు బోర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయే తప్ప వారి అభివృద్ధికి చొరవ చూపడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు సీటు కేటాయించి వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు.

ప్రొద్దుటూరు నియోజవర్గంలోకి యువగళం పాదయాత్ర

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ జాతీయకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నియోజవర్గంలోని చౌడూరు గ్రామం వద్ద టీడీపీ నాయకులు నారాలోకేష్‌కు స్వాగతం పలికారు. జమ్మలమడుగు- ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో ఉన్న చౌడూరు, శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, నరసింహాపురం, కొత్తపేట గ్రామాల మీదుగా పాదయాత్ర సాగింది.పాదయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు